క్లుప్తంగా

వేడుకగా గజ్జ పూజ

నెల్లూరు(బృందావనం): నవాబుపేట లక్ష్మీపురంలోని మీనాక్షి నృత్యాలయంలో అమితశ్రీ గజ్జ పూజోత్సవాన్ని శనివారం నిర్వహించారు. శాస్త్రీయ నృత్య ప్రదర్శనలలో సింహపురి ఖ్యాతిని మరింత ఇనుమడింపజేయాలని పలువురు కాంక్షించారు. శింగంశెట్టి మురళీమోహన్‌రావు, కళాకారులు కృష్ణ, మహేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎం - 1 రేపు

నెల్లూరు సిటీ: ఆర్టీసీ ఒకటో డిపో పరిధిలోని ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలు ఇచ్చేందుకు గానూ డయల్ యువర్ డీఎం – 1 కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నామని మేనేజర్ మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 99592 25641 నంబర్‌కు సాయంత్రం నాలుగు నుంచి ఐద గంటల్లోపు ఫోన్ చేయాలని కోరారు.

ఉచిత వైద్యశిబిరం నేడు

నెల్లూరు(బృందావనం): మన్సూర్‌నగర్ సమీపంలోని హాజిరా హాస్పిటల్లో ఉచిత గుండె వైద్యశిబిరాన్ని జమాతే ఇస్లామి హింద్ నగర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్నామని షహబుద్దీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు వరకు నిర్వహించనున్న శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతుల విశిష్ట సంఖ్యపై ప్రత్యేక దృష్టి



కొడవలూరు: రైతుల విశిష్ట సంఖ్య నమోదుపై వ్యవసాయ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. నమోదుపై లక్ష్యాలను నిర్దేశించడంతో రైతులను ప్రోత్సహించి ప్రక్రియ జరిపేందుకు వ్యవసాయ సిబ్బంది కసరత్తు చేస్తున్నారు. రాయితీలు, రుణాలు తదితరాలను దీని ఆధారంగానే అందజేయనున్నామని ప్రభుత్వం ప్రకటించడంతో, విశిష్ట సంఖ్య నమోదుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. మండలంలో ఈ నెలాఖరు నాటికి మూడు వేల మంది రైతులకు విశిష్ట సంఖ్యను నమోదు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. దీంతో రైతు సేవా కేంద్రాలతో పాటు మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో నమోదు చేస్తున్నారు. మండలంలో ఇప్పటికే 1100 మంది రైతులకు నమోదు చేశారు. ప్రక్రియను మరింత వేగవంతం చేసి నెలాఖరులోపు లక్ష్యాన్ని సాధిస్తామని ఏఓ లక్ష్మి తెలిపారు.

ముగిసిన శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న జ్యోతి

కొడవలూరు: శిక్షణలో తెలుసుకున్న అంశాలను అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్రాల్లో అమలు చేస్తే చిన్నారులు అన్ని విధాలా అభివృద్ధి చెందుతారని కోవూరు సీడీపీఓ జ్యోతి సూచించారు. మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు కొడవలూరు జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నిర్మల, నాగభూషణమ్మ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 26 మందికి ఉద్యోగాలు



విడవలూరు: స్థానిక పీఆర్ఆర్ – వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళాను హీరో మోటార్ కార్ప్, డైకిన్ సంస్థల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సుజాత మాట్లాడారు. 26 మందిని ఎంపిక చేసి వారికి నియామక పత్రాలను అందజేశారని వివరించారు. రానున్న రోజుల్లో మరిన్ని జాబ్ మేళాలను నిర్వహించేందుకు తమ వంతు కృషి చేస్తానని చెప్పారు. కళాశాల కెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కమ్మేసిన పొగమంచు



కొడవలూరు: మండల పరిధిలోని జాతీయ రహదారిని పొగమంచు శనివారం కమ్మేసింది. ఉదయం ఎనిమిది గంటల వరకు ఇదే పరిస్థితి నెలకొనడంతో వాహనాలు రాకపోకలు సాగించలేకపోయాయి. లారీలను ఎక్కడికక్కడ రోడ్డు పక్కన నిలిపేశారు. తర్వాత మంచు పొరలు తగ్గుతూ వచ్చాయి.

ప్రకటనలు.. నీటి మూటలేనా..?

- ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటులో నిర్లక్ష్యం
- కరెంట్ లేక ఎండుతున్న మామిడి తోట
- కన్నీరుమున్నీరవుతున్న రైతు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా రైతులకు పగటి పూట నాణ్యమైన తొమ్మిది గంటల విద్యుత్‌ను అందిస్తున్నామని.. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే 24 గంటల్లో నూతనంగా ఏర్పాటు చేసి అన్నదాతలకు ఎలాంటి సమస్య లేకుండా చూస్తామని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ తరచూ చెప్తుంటారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. ఆ శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ సరఫరా లేక పచ్చని మామిడితోట కళ్ల ముందే ఎండిపోతోంది. ఫలితంగా ఏమి చేయాలో పాలుపోక రైతు నిస్సహాయ స్థితిలో ఉన్నారు.

ఇదీ ఉదాహరణ..

ఉదయగిరి మండలం అప్పసముద్రానికి చెందిన రైతు చేజర్ల లక్ష్మీరెడ్డి తన పొలంలో మామిడి, సపోటాను సాగు చేస్తున్నారు. వీటికి బోరు ద్వారా నీటిని అందించేందుకు గానూ 51000 03311 నంబర్‌తో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. మామిడి, సపోటా పూత దశకు చేరుకున్న క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. ఇది జరిగి నెలవుతున్నా, నేటికీ దాన్ని ఏర్పాటు చేసే దిశగా సంబంధిత అధికారులు, సిబ్బంది ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. ఇవి ఎండుముఖం పడుతున్న తరుణంలో రైతు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇదే విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లభించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ లేక ఖాళీగా దర్శనమిస్తున్న దిమ్మె



ఎండుతున్న తోటలు

సమస్యను పరిష్కరిస్తాం



ఉదయగిరిలో రైతుకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైనా ఏర్పాటు చేయలేదనే అంశం నా దృష్టికి వచ్చింది. పంట ఎండిపోవడం బాధాకరం. రైతులు, వినియోగదారులకు మెరుగైన సేవలందించడమే సంస్థ ప్రధాన లక్ష్యం. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపడతాం.

– విజయన్, ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ

పాఠశాల విలీనాన్ని అంగీకరించేదిలేదు



పాఠశాల ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన

నెల్లూరు సిటీ: గుడిపల్లిపాడులో దాదాపు 34 ఏళ్లుగా నిర్వహిస్తున్న పాఠశాలలో 3, 4, 5వ తరగతుల విద్యార్థులను మూడు కిలోమీటర్ల దూరంలోని అల్లీపురం ఎంపీపీఎస్ పాఠశాలలో విలీనం చేయాలనే నిర్ణయాన్ని తాము అంగీకరించేదిలేదని విద్యార్థుల తల్లిదండ్రులు స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం చేపట్టిన ఆందోళనలో వారు మాట్లాడారు. పాఠశాలలో 53 మంది చదువుకుంటున్నారని, అయితే అల్లీపురం మెయిన్ రోడ్డులోని ఎంపీపీఎస్ పాఠశాలలో విలీనం చేస్తున్నారని చెప్పారు. ప్రధాన రహదారిలో పిల్లలు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విలీన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల చైర్‌పర్సన్ శైలమ్మ, వైస్ చైర్‌పర్సన్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



నెల్లూరు సిటీ: ఉప్పుటూరులో రూ.25 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన శంకుస్థాపనను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శనివారం నిర్వహించారు. సర్పంచ్ అంబటి వెంకటసుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ వెంకటరత్నం, టీడీపీ నేతలు పెంచలయ్య, రాపూరు బాబు తదితరులు పాల్గొన్నారు.

తపాలా శాఖలో సమీక్ష



మాట్లాడుతున్న శివనాగరాజు

నెల్లూరు రూరల్: నగరంలో పోస్టల్ శాఖ నిర్వహించిన కార్యక్రమాలకు తపాలా ఏపీ సర్కిల్ అసిస్టెంట్ డైరెక్టర్ శివనాగరాజు శనివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా అన్ని పోస్టాఫీసులను సందర్శించి మధ్యాహ్నం మూడు గంటలకు సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సేవలందించాలని సూచించారు. పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొమ్మలు పడి తెగిన విద్యుత్ లైన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కొబ్బరి చెట్టు వాలి విద్యుత్ తీగలపై పడిన ఘటన నగరంలోని 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డి కాలనీ సెంటర్ వద్ద శనివారం చోటుచేసుకుంది. కొమ్మలు పడటంతో తీగలు తెగిపోయాయి. సమాచారం అందుకున్న సిబ్బంది హుటాహుటిన చేరుకొని, సరఫరాను నిలిపేసి పునరుద్ధరణ చర్యలు చేపట్టారు.



‘అమ్మంటే’ లఘు చిత్రానికి బహుమతి



నెల్లూరు(బృందావనం): అనంతపురం ఫిల్మ్ సొసైటీ నిర్వహించిన పోటీల్లో నెల్లూరు లవ్లీ క్రియేషన్స్ వారి ‘అమ్మంటే’ షార్ట్ ఫిల్మ్ ఉత్తమ లఘు చిత్రం బహుమతిని అందుకుంది. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో దర్శకుడు కొండవీటి సత్యం, అనంతపురం ఫిల్మ్ సొసైటీ డైరెక్టర్ రషీద్ చేతుల మీదుగా అవార్డును లఘు చిత్ర రచయిత రామచంద్రమూర్తి అందుకున్నారని దర్శకుడు కళాంజలి అనంత్ తెలిపారు.

ఏప్రిల్ 14న పురస్కారాల ప్రదానం



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): తెలుగు రాష్ట్రాల పరిధిలో విభిన్న రంగాలకు చెందిన ప్రతిభావంతులకు పురస్కారాలను ఏప్రిల్ 14న అందజేయనున్నామని జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ ఉషా కిరణ్‌రాయ్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను మాగుంట లేఅవుట్లోని ఓ హోటల్లో శనివారం ఆవిష్కరించిన అనంతరం విలేకరులతో ఆమె మాట్లాడారు. గ్లోబల్ పీస్ సమ్మిట్, అమెరికన్ యూనివర్సిటీ, కొండూరు హరినారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వీటిని ప్రదానం చేయనున్నారని వివరించారు. అనంతరం హరినారాయణరెడ్డి మాట్లాడారు. దరఖాస్తులను ఆహ్వానించి, పరిశీలన అనంతరం పురస్కారాలను అందజేయనున్నామని చెప్పారు. వివరాలకు 98480 34522, 99488 44500 నంబర్లను సంప్రదించాలని సూచించారు. రాయ్ జెసన్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



నెల్లూరు (టౌన్): పొదలకూరు రోడ్డులోని సెయింట్ జోసఫ్స్ స్కూల్లో క్రీడోత్సవాలను శనివారం నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం క్యాంప్ ఫైర్‌ను నిర్వహించారు. డీఈఓ బాలాజీరావు, డీఎస్ఓ యతిరాజ్, కరస్పాండెంట్ సిస్టర్ బెట్టిలియా తదితరులు పాల్గొన్నారు.

నేత్రాలపై జాగ్రత్త వహించాలి

నెల్లూరు సిటీ: కంటి చూపుపై చిన్నారులు జాగ్రత్తలు పాటించాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరు రోడ్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. డాక్టర్ శర్వాణి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నెల్లూరు (పొగతోట): పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. నగరంలోని జెడ్పీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రకృతిని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని చెప్పారు.

➡ నెల్లూరు(బారకాసు): నగరంలోని 54 డివిజన్లలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను నిర్వహించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో అవగాహన ర్యాలీలను నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జరిపారు. కొన్నేళ్లుగా గార్బేజ్ పాయింట్లుగా వినియోగిస్తున్న ప్రదేశాలను శుభ్రం చేసి రంగువల్లులతో అలంకరించి పూల మొక్కల కుండీలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు, స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు.

➡ నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని విద్యుత్ భవన్‌తో పాటు సబ్‌స్టేషన్లలో పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించారు. విద్యుత్ భవన్‌లో పరిసరాలను ఈఈ (కన్‌స్ట్రక్షన్స్) పరంధామయ్య తదితరులు శుభ్రం చేశారు. ఆయా కార్యక్రమాల్లో నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్, నోడల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, డీఈఈ అశోక్, ఏఈ దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

➡ నగరంలోని డీసీఓ కార్యాలయ ప్రాంగణాన్ని డీసీఓ గుర్రప్ప ఆధ్వర్యంలో శుభ్రం చేసి మొక్కలు నాటారు.

➡ నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల ఆవరణలో చెత్త, పిచ్చి మొక్కలను విద్యార్థులు, అధ్యాపకులు తొలగించారు. అనంతరం విద్యార్థులతో స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపల్ గిరి, ఎన్నెస్సెస్ అధికారులు ఉమామహేశ్వరి, విద్య, మనోజ్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



పరిసరాలను శుభ్రం చేస్తున్న అరుణమ్మ తదితరులు

➡ నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): కార్యాలయాలు, వాటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ఉద్యోగుల బాధ్యత అని జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ దేశ్ నాయక్ పేర్కొన్నారు. నగరంలోని ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో పరిశుభ్రత కార్యక్రమాలను ఇంజినీర్లు, ఉద్యోగులు చేపట్టారు. నెల్లూరు సెంట్రల్ డివిజన్ ఈఈ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

➡ నెల్లూరు(అర్బన్): స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ పరిపాలనాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర సాధన కోసం కృషి చేస్తామంటూ నగరంలోని డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద వైద్యశాఖ అధికారులు, ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. ప్రోగ్రామ్ అధికారి దయాకర్, డాక్టర్లు రమేష్, సురేంద్రబాబు, యశ్వంత్, డెమో అధికారి కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

➡ కలెక్టరేట్ ఆవరణలో స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని డీఆర్వో ఉదయభాస్కర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

➡ కలెక్టరేట్ ఆవరణలోని ఖజానా కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఉప సంచాలకుడు గంగాద్రి, ఏఓ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

➡ నెల్లూరు సిటీ: మాదరాజుగూడూరులో అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ శైలేంద్రకుమార్, ఈఓపీఆర్డీ వెంకటరమేష్, ఎంపీపీ విజయ్‌కుమార్, టీడీపీ నేత గున్నయ్య, సర్పంచ్ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

➡ నెల్లూరు(బృందావనం): నగరంలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞను ఈఓ గిరికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. దేవస్థాన పరిసరాల్లో శుభ్రం చేశారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



విద్యుత్ భవన్‌లో..



డీసీఓ కార్యాలయంలో..



ఇరిగేషన్ కార్యాలయంలో..



డీఎంహెచ్ఓ కార్యాలయంలో..



డీకేడబ్ల్యూ కళాశాలలో..



మాదరాజుగూడూరులో..



ఇరుకళల పరమేశ్వరి దేవస్థానంలో..



మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులు